క్లుప్తంగా

ప్రత్యేక పూజలు




ప్రత్యేక అలంకరణలో తిరుమలరాయుడు, రామలింగేశ్వరస్వామి

కృష్ణగిరి: నూతన సంవత్సర వేడుకలు బుధవారం మండల వ్యాప్తంగా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కొత్త సంవత్సరంలో తలపెట్టే ప్రతి పనిలో విజయం సాధించాలని మండలంలోని పురాతన దేవాలయాలైన కర్లకుంటలోని తిరుమలరాయుడు స్వామి, చుంచుఎర్రగుడిలోని రామలింగేశ్వర స్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆయా గ్రామాల్లో వివిధ దేవాలయాల్లో పూజలు నిర్వహించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

రంగనాథుడికి పల్లకీ సేవ



దేవేరులతో పల్లకీలో ఊరేగుతున్న రంగనాథుడు

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలో వెలసిన రంగనాథస్వామి దేవాలయంలో ధనుర్మాస పూజల్లో భాగంగా బుధవారం స్వామి వారికి పల్లకోత్సవం నిర్వహించారు. ముందుగా మూలవిరాట్ రంగనాథస్వామి, శ్రీదేవి, భూదేవిలకు ఉదయం బిందెసేవ, అభిషేకం, అష్టోత్తరనామార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుంచి ఆలయంలో ప్రదక్షిణ చేపట్టారు. పూజా కార్యక్రమాల్లో ఈఓ వీరయ్య, అర్చకులు రంగస్వామి, భక్తులు పాల్గొన్నారు.

విరాళం..

రంగనాథస్వామి దేవాలయంలో తూర్పు రాజగోపురం నిర్మాణానికి అవసరమైన స్థలం కొనుగోలుకు బైసాని శ్రీపాదగుప్త, లీనా రూ.20,123 విరాళాన్ని కార్యనిర్వహణాధికారి వీరయ్యకు బుధవారం అందజేశారు.

గ్రామ పంచాయతీ దుకాణాల అప్పగింత



పంచాయతీ దుకాణాల తాళాలను వ్యాపారస్తులకు అందజేస్తున్న ఈఓ ప్రభాకర్

ఆలూరు రూరల్: స్థానిక సంత మార్కెట్‌లో గ్రామ పంచాయతీ దుకాణాలను వేలం పాటలో దక్కించుకుని ఏడాది అద్దె చెల్లించిన వ్యాపారులకు ఈఓ ప్రభాకర్ బుధవారం షాపుల తాళాలు అప్పగించారు. గత ఏడాది నవంబర్ నెలలో గ్రామ పంచాయతీకి చెందిన 27 దుకాణాలకు బహిరంగ వేలాలు నిర్వహించారు. ఇటీవల షాపులకు విద్యుత్ సౌకర్యం కల్పించడంతో వాటిని వ్యాపారులకు అప్పగించారు. సకాలంలో అద్దె చెల్లించి గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ఈఓ కోరారు.

మొక్కలతో కాలుష్య నివారణ



మొక్క నాటుతున్న అధికారులు, నాయకులు

మద్దికెర : ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు మొక్కలు నాటి పెంచాలని ఈఓ సుధాకర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పురుషోత్తం చౌదరి అన్నారు. బుధవారం మండలంలోని పెరవలి గ్రామంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటి వదిలేయకుండా సంరక్షిస్తే పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. చెట్ల సంఖ్య పెరిగితే కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా ప్రాణకోటికి స్వచ్ఛమైన గాలిని అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇటు వైపు చూడండి సారూ!



వందవాగిలిలోని గజ్జహళ్ల రోడ్డులో చెత్తకుప్పలు

హొళగుంద: మండలంలోని వందవాగిలి గ్రామంలో బీసీ కాలనీకి వెళ్లే రోడ్డులో డ్రైనేజీలను నిర్మించాలని, అలాగే చెత్త కుప్పలు తొలగించాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు. ఆ రోడ్డులో పారిశుద్ధ్యం పడకేసి దుర్వాసన వెదజల్లుతుందని, చెత్త చెదారం నిండిపోవడంతో మురుగునీరు ముందుకెళ్లకుండా నిలిచిపోయిందని వాపోతున్నారు. దీని కారణంగా దోమల బెడద తీవ్రంగా మారిందని, వ్యాధులతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.అధికారులు స్పందించి డ్రైనేజీలు నిర్మించి పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

దారులు బాగు చేయరూ!

- ముళ్ల కంచెలతో నిండిపోయిన పొలాలకు వెళ్లే దారులు
- ఉపాధి హామీ పథకం కింద బాగు చేయించాలంటున్న రైతులు
- పట్టించుకోని అధికారులు
- రాకపోకలకు వీలుకాక అన్నదాతల అవస్థలు



జొహరాపురం గ్రామంలో ముళ్ల కంచెలతో నిండిపోయిన పొలాలకు వెళ్లే దారి

ఆస్పరి: పొలాలకు వెళ్లే దారులు ధ్వంసమయ్యాయని, చాలా ప్రాంతాల్లో కంప చెట్లతో మూసుకుపోయాయి. రాకపోకలకు వీలుకానట్లుగా మారాయని, వాటిని ఉపాధి హామీ పథకం కింద బాగు చేయించాలని రైతులు కోరుతున్నారు. కాగా.. ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులు తమకు దాదాపు ఉపయోగపడం లేదని, తమకు మేలు చేకూర్చే పనులు చేయాలని రైతులు పేర్కొంటున్నారు. ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా ఫారం పాండ్స్, డకౌట్ ఫారం పాండ్స్, చెరువులు, కుంటలు, కాలువల్లో పూడిక తీత పనులు మాత్రమే చేయిస్తున్నారు. పొలాలకు వెళ్లే దారులు ముళ్ల కంచెలతో నిండిపోయినా పట్టించుకునే నాథుడే లేడని వారు వాపోతున్నారు. మండలంలోని గ్రామాలన్నింటిలో ఇదే పరిస్థితి. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసినా ఆ పనులు రైతులకు ఏమాత్రం ఉపయోగపడటం లేదని రైతులు చెబుతున్నారు. పొలాలకు వెళ్లే దారులు ముళ్ల కంచెలతో నిండిపోవడం వల్ల ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు వెళ్లలేకపోతున్నాయని, దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. ముఖ్యంగా విత్తనం వేసే సమయం, దిగుబడులు ఇళ్లకు తెచ్చుకునేటప్పుడు రాకపోకలు ఎక్కువగా సాగుతుంటాయి. ఈ సమయంలో సరిగా లేని రస్తాలతో అవస్థలు తప్పడం లేదంటున్నారు. పొలాలకు వెళ్లే దారులు బాగు చేయించాలని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని జొహరాపురంలో గ్రామంలో 15వేల ఎకరాల భూమి ఉంది. గ్రామం నుంచి పొలాలకు వెళ్లే తిప్పన్నబావి, పెద్ద హోతూరు, ములగవల్లి , సందన్న మోరి రస్తా అధ్వానంగా ఉండడంతో ఏటా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ఉపాధి హామీ పథకం కింద పొలాలకు వెళ్లే రస్తాల్లో ముళ్ల కంచెలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు. కాగా.. ఉపాధి హామీ పథకం కింద మండలంలో 2024 ఏప్రిల్ నుంచి 2025 జనవరి 1వ తేదీ వరకు రూ.8.47 కోట్లు కూలీలకు చెల్లించారు. రూ.1.47 కోట్లతో సీసీ రోడ్లు, హెల్త్ క్లీనిక్‌లు, సచివాలయాలు, ఆర్బీకేలు, మినీ గోకులాల నిర్మాణాలకు ఖర్చు చేశారు. మొత్తం రూ.9.94 కోట్లు పథకం కింద వ్యయం చేశారు.

పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం



పొలాలకు వెళ్లే రస్తాల్లో ముళ్ల కంచెలు పెరిగిపోవడం వల్ల ఎద్దుల బండ్లు వెళ్లేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నాం. విత్తనం వేసేటప్పుడు, పంటను ఇంటికి తీసుకెళ్లటప్పుడు కష్టపడాల్సిన పరిస్థితి నెలకొంది. పొలాలకు వెళ్లే రస్తాలను బాగు చేయిస్తే రైతులకు సౌకర్యంగా ఉంటుంది.

– లింగారావు, రైతు, జొహరాపురం గ్రామం

అధికారులు పట్టించుకోవడం లేదు



పొలాలకు వెళ్లే రస్తాలను బాగు చేయించాలని గ్రామానికి వచ్చిన అధికారులకు చాలా సార్లు చెప్పినా పట్టించుకోలేదు. ఉపాధి హామీ పథకం రైతులకు ఏమాత్రం ఉపయోగ పడటం లేదు. ప్రతి సంవత్సరం అవే కుంటలు, చెరువుల్లో పూడిక తీస్తున్నారు. ఏటా వాటిల్లో ఏం పని ఉంటుంది. వాటికి బదులుగా రైతులకు ఉపయోగపడే పనులు చేస్తే చేసిన పనులకు కూడా విలువ ఉంటుంది. ఉపయోగం లేని వాటిని చేసి డబ్బులు అనవసరంగా ఖర్చు. మా గ్రామానికి 15వేల ఎకరాల పొలాలున్నాయి. నాలుగు రస్తాలు ఉన్నాయి. అన్నీ వెళ్లేందుకు ఇబ్బందిగానే ఉన్నాయి. బాగు చేయించే పనులు చేపట్టాలి.

– దస్తగిరి, రైతు, జొహరాపురం

నేటి నుంచి మస్తానయ్య ఉరుసు

తుగ్గలి : మండల పరిధిలోని జీ.ఎర్రగుడి గ్రామంలో వెలసిన మస్తానయ్య ఉరుసు ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. గురువారం గంధం, శుక్రవారం ఉరుస్తు నిర్వహిస్తున్నట్లు దర్గా నిర్వాహకులు తెలిపారు.

నేడు హొళగుందలో గ్రామసభ

హొళగుంద: స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామ సభ జరుగుతుందని ప్రజలు హాజరై సమస్యలను పాలక మండలి దృష్టికి తీసుకురావాలని పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చలవాది రంగమ్మ ఆధ్వర్యంలో వార్డు మెంబర్లతో కలిసి గ్రామసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తాగునీరు, డ్రైనేజీలు, సీసీ రోడ్ల తదితర సమస్యలను చర్చిస్తామని చెప్పారు. వార్డు సభ్యులు, గ్రామస్తులు హాజరు కావాలని కోరారు.

నేడు రెవెన్యూ సదస్సు

కృష్ణగిరి: మండల పరిధిలోని టి.గోకులపాడు గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. భూ సమస్యలున్న రైతులు సదస్సులో అర్జీ రూపంలో అందజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో రామలింగేశ్వరస్వామి ఆరాధనోత్సవం




ప్రత్యేక అలంకరణలో శరణం రామలింగేశ్వరస్వామి, గ్రామంలో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలో బుధవారం శరణం శ్రీ రామలింగేశ్వర 86వ ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. మొదట గంగపూజ, నందికోలు సేవ, ఎద్దుల ఊరేగింపు కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమానికి రుద్రమునిస్వామి, శాంతికుమార్‌స్వామి, జె.హొసళ్లి పట్టదా శంభులింగస్వామి, నాగలింగమయ్యస్వామి, శివకుమార్‌స్వామి, గంగాధరస్వామి, ప్రభులింగయ్య పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

తుంపర సేద్యం.. బహుబాగు



దేవనకొండ మండలం పల్లెదొడ్డి గ్రామంలో వేరుశనగ పంటను డ్రిప్ పద్ధతిలో సాగు చేస్తున్న దృశ్యం

- తక్కువ సాగునీటితో పంటల సాగు
- డ్రిప్ పద్ధతిని ప్రోత్సహించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఆలూరు వ్యవసాయ సబ్‌డివిజన్‌లో 5 వేల హెక్టార్లలో సూక్ష్మ సేద్యం

ఆలూరు: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంభిస్తున్నారు. నియోజకవర్గంలో సాగునీటి వనరులు తక్కువ. దీంతో తక్కువ నీటితో పంటలు సాగు చేయడానికి మొగ్గు చూపుతున్నారు. ఆలూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో ఖరీఫ్‌లో 45 వేల ఎకరాలు, రబీ సీజన్‌లో 35 వేల ఎకరాల్లో వర్షాధారంగా, హెచ్చెల్సీ, ఎల్లెల్సీ కాలువ కింద 8 వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేస్తున్నారు. అలాగే..చెరువులు, కుంటల ద్వారా 3,500 ఎకరాలు, 32 వేల బోరుబావుల కింద 10 వేల ఎకరాలు, హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా 30 వేలు ఎరకాలకు సాగునీరు అందటంతో పంటలను పండిస్తున్నారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలను సాగు చేయడానికి డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిని అనుసరిస్తున్నారు. డ్రిప్, స్ప్రింక్లర్లను అమర్చుకొని సూక్ష్మ సేద్యం చేస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నారు.

డ్రిప్‌కు పెరుగుతున్న ఆదరణ..

డ్రిప్ పద్ధతుల్లో ముఖ్యంగా వేరుశనగ, పత్తి, మిరప, జామ, మామిడి, టమాట, ఇతర కూరగాయాలు, పండ్ల తోటలను సాగు చేస్తున్నారు. ఐదెకరాలలోపు ఉన్న రైతులకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో సూక్ష్మ సేద్యం సదుపాయాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కల్పించింది. 5 నుంచి 10 ఎకరాలకు పై బడిన రైతులకు 70 శాతం సబ్సిడీ వర్తింపజేసింది. దీంతో అధిక శాతం మంది రైతులు ఈ పద్ధతిలో సాగుకు ముందుకొచ్చారు. డ్రిప్ పద్ధతిలో ఆలూరు నియోజకవర్గంలోని దేవనకొండ, ఆస్పరి మండలాలతో పాటు హాలహర్వి మండలంలోని అమృతాపురం , సిద్ధాపురం, బాపురం, చిప్పగిరి మండలంలోని డొల్తాపురం, నంచర్ల, ఎం.కొట్టాల ప్రాంతాల్లో అధికంగా పంటలు సాగు చేస్తున్నారు. వేరుశనగ, కూరగాయల పంటలతో పాటు సపోట, జామ తోటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఆలూరు వ్యవసాయ సబ్‌డివిజన్‌లో 5వేల హెక్టార్లలో ఈ పద్ధతిలో పంటలు వేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఈ ప్రాంత రైతులకు 5వేల హెక్టార్లలో పంటలు సాగు చేసేందుకు ప్రభుత్వం డ్రిప్ పరికరాలను అందజేసింది.

ఈ విధానం రైతులకు చాలా ఉపయోగకరం



తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో అనేక రకాలుగా పంటలను సాగిచేయడానికి సూక్ష్మసేద్యం మంచి పద్ధతి. పంటలకు సాగు నీటిని పెట్టె సమయంలో బోరు నుంచి వచ్చే నీరు వృథా కాదు. ప్రస్తుతం పంట సాగులో కాలువలు తెగి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి వాటికి డ్రిప్ పద్ధతిలో అవకాశముండదు. కొంచెం నీటితో పంటంతా తడుస్తుంది. కాలువల ద్వారా అయితే ఎక్కువ నీరు అవసరమవుతుంది. మన ప్రాంతాల్లో నీరు బంగారు కంటే విలువైనది కదా.. అందుకు మేం ఈ పద్ధతిలోనే పంటలు సాగు చేస్తున్నాం. ప్రస్తుతం వేరుశనగ వేశాం.

– యూసూఫ్, దేవనకొండ గ్రామ రైతు

నూతనోత్సాహం



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి



మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ శ్రేణులు

- వాడవాడలా నూతన సంవత్సర వేడుకలు
- సంబరాల్లో మునిగిన జనం
- నాయకులు, అధికారులకు వెల్లువెత్తిన శుభాకాంక్షలు
- కిటకిటలాడిన ప్రజాప్రతినిధుల నివాసాలు

పత్తికొండ/తుగ్గలి: నియోజకవర్గంలో నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. 31వ తేదీ 2024 ముగింపు పలుకుతూ.. 2025కు స్వాగతం పలుకుతూ పలువురు కేక్ కట్ చేసుకొని, బాణా సంచా కాల్చుతూ సంబరాలు చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పట్టణాలతో పాటు పల్లెల్లోనూ నూతన సందడి కనిపించింది. బుధవారం ఉదయం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి తాము చేపట్టే కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేలా చూడాలని పూజలు చేశారు. ఇక నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. పత్తికొండలో మాజీ మంత్రి ఎస్వీ సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు ఎస్.రామచంద్రారెడ్డి, నాగరత్నమ్మను పార్టీ శ్రేణులు, అభిమానులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును ఆ పార్టీ శ్రేణులు, అధికారులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. పత్తికొండ, తుగ్గలి మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు కర్నూలుకు వెళ్లి పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి,పార్టీ నేత కోట్ల హరిచక్రపాణిరెడ్డి, చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక కార్యాలయంలో డీఎస్పీ వెంకటరామయ్య సీఐలు, ఎస్ఐలు, సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా పట్టణంలోని సాయిబాబా ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు చేరుకుని సాయిబాబాతో పాటు, ఆలయ ప్రాంగణంలోని దేవుళ్లను దర్శించుకున్నారు.

ఆస్పరి: మండలంలో 2025 కొత్త సంవత్సర వేడుకలను అన్ని వర్గాల ప్రజలు ఆనందోత్సవాలు మధ్య బుధవారం జరుపుకున్నారు. ఎంపీపీ సుంకుర ఉమాదేవి, ఆస్పరి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మూలింటి రాధమ్మ, తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఎంపీడీఓ గీతావాణి, ఆస్పరి సీఐ మస్తాన్‌వలికి వివిధ గ్రామాల ప్రజలు, వివిధ పార్టీల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు శాలువ కప్పి, పూలమాలలు వేసి శుభాకాంక్షలు చెప్పారు. రామతీర్థంలోని రామలింగేశ్వరస్వామి, గాయత్రీ మాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు.



కంగాటి శ్రీదేవికి శుభాకాంక్షలు తెలుపుతున్న పత్తికొండ ఎంపీపీ దాస్, నాయకులు

కృష్ణగిరి: పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, యువ నాయకులు రామ్మోహన్‌రెడ్డికి కర్నూలులోని వారి స్వగృహంలో బుధవారం కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల పార్టీ శ్రేణులు పుష్పగుచ్ఛాలు, నోట్ పుస్తకాలు అందించి సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నేతల సమక్షంలో కేక్ కట్ చేశారు. కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో పేద ప్రజలకు న్యాయం జరిగిందని, కూటమి ప్రభుత్వంలో ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. దీంతో ఆరు నెలల్లోనే ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. కృష్ణగిరి ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ కేఈ సుభాషిణికి మండల పార్టీ శ్రేణులు శుభాకాంక్షలు తెలియజేశారు. రెండు మండలాల కన్వీనర్లు ఆర్‌బీ వెంకటరాముడు, రవిరెడ్డి, జెడ్పీటీసీ సుంకన్న, ఎంపీపీ రంగన్న, మాజీ జెడ్పీటీసీ సమీర్‌కుమార్‌రెడ్డి, నాయకులు మాధవరావు, లక్ష్మీకాంతరెడ్డి, శరభారెడ్డి, శ్రీరాంరెడ్డి, భీమిరెడ్డి, ప్రహ్లాద, మల్లికార్జున, సుభాష్, వెంకటేష్, మహేశ్వరరెడ్డి, బాలమిన్నెల్ల పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న డీఎస్పీ వెంకటరామయ్య

చిప్పగిరి: నూతన సంవత్సర వేడుకలు ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి స్వగృహం చిప్పగిరిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి తరలి వచ్చిన కార్యకర్తల నడుమ కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ప్రస్తుతం అడ్రస్ లేవని విమర్శించారు. పార్టీ మండల కన్వీనర్ మారయ్య,నాయకులు వెంకటేష్,శ్రీరాములు,చంద్రశేకర్,శేకన్న,దామోదర్ పాల్గొన్నారు.

వేడుకలూ విడి విడిగా..

ఆలూరు: నూతన సంవత్సరం వేడుకలనూ నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం వర్గాలుగా విడిపోయి జరుపుకున్నారు. దీంతో ఏ నాయకుడికి ఎక్కడికెళ్లి శుభాకాంక్షలు తెలపాలో కార్యకర్తలు అయోమయానికి గురయ్యారు. మరి కొందరు నాయకులు కండువాలు మార్చుకుని ఒకసారి, కండువా లేకుండా మరోసారి ఆయా నాయకులను కలిసి శుభాకాంక్షలు చెప్పారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక ఆర్గనైనింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాదు, ఆయన సతీమణి వైకుంఠం జ్యోతి తమ సన్నిహితులు, ఆప్తులతో స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహం ఆవరణలో కేక్ కటింగ్, వేడుకలను నిర్వహించారు. అలాగే ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బి.వీరభద్రగౌడు బళ్లారి రోడ్డు సమీపంలో తన వర్గ నాయకులు, కార్యకర్తలతో సంబరాలు జరుపుకున్నారు. ఇలా వర్గాలుగా విడిపోయి వేడుకలను నిర్వహించుకోవడంపై కార్యకర్తలు గందరగోళానికి గురయ్యారు.




పత్తికొండలో మాజీ మంత్రి ఎస్వీ సుబ్బారెడ్డి, నాగరత్నమ్మకు శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు, ప్రదీప్‌కుమార్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

శ్రీమఠంలో కన్నడ సినీ నటుడు జగ్గేష్




పీఠాధిపతి ఆశీర్వాదం తీసుకుంటున్న నటుడు జగ్గేష్, జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్ దంపతులు

మంత్రాలయం: నూతన సంవత్సరం సందర్భంగా కన్నడ సినీ నటుడు జగ్గేష్, జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్ వేర్వేరుగా మంత్రాలయం వచ్చారు. బుధవారం శ్రీమఠానికి చేరుకుని ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని అర్చన సహిత హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాఘవేంద్ర స్వామి మూల బృందావనం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. వారిని పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు ఫల, పూల మంత్రాక్షితలు, రాఘవేంద్ర స్వామి జ్ఞాపికను అందజేసి ఆశీర్వదించారు. నటుడు జగ్గేష్‌తో సెల్ఫీలు దిగేందుకు భక్తులు ఆసక్తి చూపారు.

సెల్ టవర్ ఏర్పాటు చేయండి



సెల్ సిగ్నల్స్ లేవని చెబుతున్న ముగుమానుగుంది గ్రామస్తులు

హొళగుంద: మా గ్రామానికి ఏ సెల్‌ఫోన్ కంపెనీకి చెందిన సిగ్నల్స్ రావడం లేదని సెల్ టవర్ ఏర్పాటు చేయాలని మండలంలోని ముగుమానుగుంది గ్రామానికి చెందిన రవి, దేవరాజ్, రాజ, బసప్ప, తిప్పన్న కోరారు. బుధవారం వారు మాట్లాడుతూ తమ గ్రామం కొండ పక్కనే ఉండటం వల్ల సెల్ సిగ్నల్స్ రాకపోవడం, నెట్ పనిచేయకపోవడం తదితర సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఏదైనా అత్యవసర పనులు ఉంటే గ్రామ శివారుకు వెళ్లి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతామని అక్కడ కూడా వాయిస్ బ్రేక్ కావడం, నెట్ కట్ కావడం, సిగ్నల్స్ సరిగాఅందవని వాపోయారు. అత్యవసర సమాచారాలు తమకు చేరక సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరి దగ్గర వివిధ కంపెనీల సిమ్‌లు ఉన్నప్పటికీ గ్రామంలో మాత్రం చేయవన్నారు. ప్రైవేటు లేదా బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటు చేయాలని కోరారు.